

# పసిడిమనసులు

## - షర్మిల



## చెలిమి

రేపే అరకు టూర్ అదీ కాలేజీ వాళ్ళం అంతా కలిసి. రేపు ఎప్పుడెప్పుడవుతుందా అని ఆ రాత్రి నిద్ర కూడా సరిగ్గా పోలేదు.

మాతో పాటు మాకు కాపలా కి అనుకోండి మా ఇంగ్లీష్ మేడం రమాదేవి వస్తున్నారు. బైపీసీ వాళ్ళకి బొటానికల్ టూర్ కాబట్టి వాళ్ళ బోటనీ మేడం సరస్వతి గారు.ఇక మొగ పిల్లల్ని అదిలించడానికి ఒక సర్ ఎలాగూ వస్తారు.

అసలే కో ఎడ్యుకేషన్ కాలేజీ ఇక సందడికేం తక్కువ. అప్పుడప్పుడే అర విరిసిన పువ్వుల్లాంటి పిల్లలం, పదహారో ఏట అడుగుపెట్టినా ఏదో పెద్ద వాళ్ళం అయిపోయామనే ఫీలింగ్.

పొద్దున్నే రైలు విశాఖపట్నం నుంచి బయల్దేరింది. డిసెంబర్ నెలేమో రైలు పెట్టె చల్లగా వుంది. ఒకే పెట్టెలో ఆడపిల్లలం ఒక దగ్గర, మొగపిల్లలు ఒక దగ్గర కూర్చున్నాం.

రైలు ఎస్. కోట దాటింది. బొడ్డవర నుంచి ఘాటీ మొదలు .

శివలింగపురం నుంచి ఎక్కడ రైలు ఆగినా మా క్లాస్మేట్ గణేష్ దిగి అల్లిబిల్లిగా అల్లుకున్న లతల్ని , అడివి పూలని తెంపి నాకు తెచ్చి ఇవ్వడం మొదలెట్టాడు. పోనీ మిగతా వాళ్ళకీ ఇచ్చి నాక్కూడా ఇస్తే మొహమాటం వుండదు.కానీ గణేశ్ మాత్రం ప్రత్యేకంగా నాకే తెచ్చి ఇస్తుంటే ఇబ్బందిగా అనిపించింది.

అందుకే వాడు వచ్చేసరికి ఈ మూలకో ఆ మూలకో నక్కి కూర్చోవడం మొదలెట్టాను. గణేశ్ అంటే మేడంలకి ఇష్టం కాబట్టి సరిపోయింది.గణేష్ అన్నీ తానై పనులు చేస్తాడు. లగేజీ మోయటం దగ్గరనుంచి వాళ్ళేం చెప్పినా నిమిషాల మీద చేసేసి ఇంకా బాగా దగ్గరయిపోయాడు.

అరకు వెళ్ళే సరికి మధ్యాహ్నం అయ్యింది. చలి వణికించేస్తోంది. అక్కడ దిగిన తరవాత అకామిడేషన్ ఎక్కడ అని తర్జన బర్జన. చివరికి రైల్వే వాళ్ళ ఆడిటోరియంలో వుందామన్నారు.

అదృష్టం బాగుండి ఆ రోజు ఖాళీగానే వుంది. అరుకు రైల్వేలో పని చేసే వాళ్ళు ఒక్కో గది టూరిస్ట్ లకి ఇస్తారంట. అరకులో ఆర్ ఎండ్ బీ గెస్ట్ హౌస్ తప్ప వుండటానికి ఏమీ లేవు.

అరకు ఎటు చూసినా పచ్చదనం ఒలికిస్తోంది. కొప్పుల్లో పూలు పెట్టుకుని ఎర్రటి చీరలు కట్టుకున్న అడవి మందారాల్లాంటి ఆడవాళ్ళు ఆ పచ్చదనానికి పూసిన పూలల్లే వున్నారు .

ఇవ్వాళ పద్మావతీ గార్డెన్స్ వెళ్ళి, రేపు జలపాతం దగ్గరికి అన్నారు లెక్చరర్లు. పద్మావతీ గార్డెన్స్ కలల లోకం ఇలాగే వుంటుందా అన్నట్టుంది .

తెలుపు , ఎరుపు , లేత గులాబీ , మెరూన్ ఇలా రంగు రంగుల గులాబీలు దోసెడు సైజులో చెట్ల నిండా విరగపూసాయి.ఇంకా సింధూరం, దాసించెక్క లాంటి ఎన్నో ప్రత్యేకమైన చెట్లు చూశాం.

గణేష్ ఎక్కడి నుంచి ఎవరిని కాకా పట్టి తెచ్చాడో ఒక పెద్ద ఎర్రగులాబీ పట్టుకొని మా వైపే వస్తున్నాడు. నేను ప్రమాదం పసిగట్టి ఒక పెద్ద చెట్టు చాటున దాక్కున్నాను .

మా మేడం "ఏవోయ్ గణేష్ ! నాకేనా తెచ్చావ్ ? " అని చొరవగా ఆ గులాబీ చేజిక్కించుకోబట్టి సరిపోయింది .

ఆ రాత్రి అక్కడ హోటల్ రాజుగారికి ముందే ఇంత మంది భోజనానికి వస్తామని చెప్తే వండి వుంచారు. ఒక రోజు రాత్రి వుండి మర్నాడు మధ్యాన్నం తిరుగు ప్రయాణం .

ఆ మర్నాడు పొద్దున్న తయారై జలపాతానికి వెళ్ళాం.

నేను స్నానం చేసి వచ్చి మొహానికి చుక్కలు చుక్కలుగా ఫెయిర్ అండ్ లవ్లీ రాసుకుని ఐ బ్రోస్ దిద్దుకుని తర్వాత పౌడర్ అద్దుకుని బొట్టు దిద్దుకున్నాను. నేను బయటికొచ్చాక సూర్యకుమారి "నువ్వు తయారయినంతసేపూ మన రమాదేవీ మేడం నిన్నే కన్నార్పకుండా చూశారు తెలుసా!" అంది.

ఈ రెండు రోజులూ రెండు నిమిషాల్లాగా అయిపోయినియ్. పండగ సెలవలు ఇచ్చారు. సెలవలు అయినాకా కాలేజీ పెట్టారు.

కాలేజీ ఫ్రెషర్స్ డే హడావిడి మొదలయ్యింది. గణేష్ క్లాస్ రెప్రజెంటేటివ్ కూడా కావడంతో ఏదో ఒక పని చెప్తే చేసుకొస్తున్నాడు.

నేను కాలేజీ సెక్రెటరీనయ్యే నాకూ బోలెడు పనులు. ఇక సాయంత్రం ఫంక్షన్ అనగా ఆ రోజు మధ్యాహ్నం గణేష్ ని పూలబొకేలు తెమ్మని చెప్పి నేను ఇంటికి వెళ్ళాను.

సాయంత్రం ఫంక్షన్ కి ఆకుపచ్చ బోర్డర్ వున్న ఉల్లి పాయ రంగు పట్టులంగా, ఆకుపచ్చ ఓణీ వేసుకుని రెడీ అయి కాలేజీకి వచ్చాను.

ఇంతలో కొంతమంది కుర్రాళ్ళు పరిగెత్తుకొచ్చారు. ఇసకలోడుతో వైజాగ్ ఎళ్ళే లారీ బోల్తా పడి ఇద్దరు చనిపోయారని అదే లారీలో గణేష్ కూడా వున్నాడని కబురు చెప్పారు .

దెబ్బలు తగిలిన వాళ్ళలో గణేష్ వున్నాడని కేజీహెచ్ లో చేర్చారని తెలిసింది .

అప్పటికే చీఫ్ గెస్ట్, పిలిచిన రాజకీయ నాయకులు రావడంతో ఫంక్షన్ చేయక తప్పలేదు. మర్నాడు హాస్పటల్ కి వెళ్ళాలనుకుని ఫ్రెండ్స్ ని రమ్మన్నాను.

వాళ్ళు వచ్చి గణేష్ "నిన్నే కలవరిస్తున్నాడంట" అని చెప్పారు.

నాకు విపరీతమైన కోపం వచ్చింది.

" వాడు నన్నెందుకు కలవరిస్తున్నాడు వాడికి ఏమన్నా పిచ్చా?" అన్నాను చిరాగ్గా.

కేజీహెచ్ కి వెళ్ళిన మేం గణేష్ ను వుంచిన వార్డులోకి వెళ్ళి పలకరించాం. చెయ్యి విరిగిందని కట్టు కట్టారని చెప్పాడు.

కొన్నాళ్ళకి కట్టుతో కాలేజీకి వచ్చిన గణేష్ ని నేను పలకరించకుండా మొహం తిప్పుకున్నా. రెండు మూడు రోజుల తరవాత ఒక రోజు నా దగ్గరికి వచ్చి గణేష్ "సారీ"అన్నాడు.

"నేనంటే ప్రాణం పెట్టే అమ్మనీ, నాన్నని, చివరికి నా చెల్లిని తలవకుండా నిన్ను ఎందుకు తలిచానో నాకు తలుచుకుంటేనే సిగ్గుగా వుంది" అన్నాడు

" ఇందులో నీ తప్పు లేదు, అందరి ముందూ సారీ చెపుతాను"అన్నాడు .

అరకులో అడివి పూలన్నీ తెచ్చి నా కాళ్ళ దగ్గర పోసిన గణేశ్ కళ్ళ నుంచి జలపాతంలా నీళ్ళు ప్రవహించాయి.

"గణేశ్ !నువ్వు బాధ పడొద్దు ఇక నుంచీ మనం ఫ్రెండ్స్" అన్నా నవ్వుతూ .

(వచ్చేనెల మరో కథ)

Post your comments